# చలిజ్వరం

"జవాన్లు ఇద్దరు."

"ఊఁ"

"ఒక గుమాస్తా."

"ఊఁ!"

"వంటవాడు."

"ఊఁ !"

"తహశిల్దారు పంతులూ."

"ఊఁ !"

"బియ్యం మూడుశేర్లు.

పప్పు శేరు.

చింతపండు వీశ.

మిరపకాయ అరవీశ.

ఉప్పు అర్ధశేరు.

కాఫీగింజ అరవీశ.

చక్కెర వీశ.

నెయ్యి వీశ.

విస్తరాకులు ఒకకట్ట.

ఉల్లిగడ్డలు వీశ.

మినపబేడలు శేరు.

మెంతులు, జీలకఱ్ఱ, ఆవాలూ 5 దేసి పలాలు.

ఆకులూ, వక్కలూ, లవంగాలూ వ్రాశావూ."

వంటమనిషి చెప్పిన ప్రకారం పట్టీ వ్రాసి వంతు అంగడికి పిపంంచాడు మునసబు.

తాను గ్రామమునసబు నౌకరీకి వచ్చిన తర్వాత ఇదే తహశిల్‌దారుగారు ఆ ఊరు మకాం చేయడం. తహశిల్‌దారుగారు కూడా కొత్తగా వచ్చారు ఆ తలూకాకు. ఆయనకూ ఇదే ఈవూరు మకాంచేయడం. మునసబు ఖంగారుపడుతున్నాడు.

ముందుగా వంటమనిషీ, గుమాస్తా, ఒక జవానూ వచ్చేశారు. వంతు చాకలివాండ్లు మూటలు దింపి వెళ్లిపోయారు. పదిగంటలకు తహశిల్‌దారుగారు వస్తున్నారు.

వంట చేసుకోను ఒక ఇల్లు బాగుచేయించి, చాకలివాడిని పిలిపించి దుప్పట్లుతెర అడ్డం కట్టించాడు. పొయ్యిలోకి కట్టెలూ, స్నానానికి కొత్తకుండలూ తెప్పించాడు. కుమ్మర్లను పిలిపించి నీళ్ల కాపించాడు. గ్రామచావడి కడిగించి పడకకుర్చీలూ, బల్లాలూ వేయించాడు. కాఫీలోకి పాలూ, భోజనంలోకి పెరుగూ తెప్పించాడు. జవాన్ల భోజనానికి వర్తకుల ఇళ్ళల్లో వంతు లేర్పాటును చేయించాడు. పట్టీ ప్రకారం మోయను తెప్పించి వంటమనిషికి పంపించాడు. సప్లయిలో లోపాలు అధికారికి పట్టివ్వకుండా ముందుగానే వంటమనిషి చేతిలో రెండు రూపాయలు పెట్టి అతని గడ్డం పట్టుకున్నాడు. తనకు అనుభవం తక్కువ, ఏ సప్లయి కావలసినా అడిగి చేయించుకొని మాటదక్కించవలసిందని జవాన్లని బ్రతిమలాడుకొన్నాడు మునసబు.

పదకొండుగంటలకు తహశిల్‌దారుగారి జట్కాబండి వచ్చి గ్రామచావడి దగ్గర నిలిచింది. చక్కెరపొట్లం చేతపుచ్చుకొని బండిలోనేపెట్టి దణ్ణంపెట్టాడు మునసబు.

బూర్నీసు కప్పుకొని బండిలోనే కూర్చున్నారు తహశిల్‌దారుగారు. హూ, హూ, హూ, అని వొణుకుతున్నారు.

"జ్వరం తగిలిం"దని అంటూ నెమ్మదిగా దిగి, పడకకుర్చీలో కూర్చున్నారు.

"జ్వరమే!" మునసబుకూ జ్వరం తగిలినట్టయింది.

నాటువైద్యుణ్ణి పిలిపించాడు మునసబు. పొయ్యిమీద గిన్నె అయినా దింపకుండా పరుగెత్తుకువచ్చాడు ఒక వంటవాడు. జవాన్లు వచ్చి కాళ్ళు ఒత్తుతూ కూర్చున్నారు. "ఏమి జ్వరమో!" అన్నాడు గుమాస్తా.

"తహశీల్దారుగారికి జ్వరమే!"—ఊరంతా పొక్కిపోయింది. పెద్ద రయితులూ, పెద్ద వర్తకులూ, పెద్ద బ్రాహ్మణులూ మూగిపోయారు.

"చలితో వచ్చింది—మలేరియా కాబోలు" నన్నారు కొందరు.

"శీతపైత్యపు జ్వరమేమో" అన్నారు మరి కొందరు.

"సన్నిపాతమేమో" అన్నారు ఇంకొకరు.

"దిష్టి తగిలిందేమో, ఇన్ని మిరపకాయలు తీసి పొయ్యిలో వెయ్య" మన్నారు శాస్త్రిగారు.

"దోషించిందేమో, కంట్లో ఆనందభైరవి కలికం వేయండి, మంచి" దన్నాడు కోమటి.

వైద్యుణ్ణి చెయ్యి చూడమన్నాడు గుమాస్తా.

"గర్భంలో శీతలించిం" దన్నాడు వైద్యుడు.

"అయితే—ఎట్లా?" అన్నాడు మునసబు.

"వాతరాక్షసం అరగదీసి ప్రయోగిస్తా" నన్నాడు వైద్యుడు.

"ఇక్కడ ఉండడానికి లేదు తక్షణం ఇంటికి వెళ్ళిపోతాను. మేనా తెప్పించు" అన్నారు తహశీల్దారుగారు.

"మేనా?"—నడుం జారిపోయింది మునసబుకు.

ఆ వూర్లో మేనా లేదే! ఏమిటి చెయ్యడం?

జట్కాబండి వొళ్ళు కుదుపు— పనికిరాదన్నారు. రెండెద్దుల బండికి గూడు కట్టించి పంపుతా నన్నాడు మునసబు. పనికిరాదన్నారు తహశీల్దారుగారు.

గ్రామ పెద్దలందరూ మొఖమొఖాలు చూచుకొన్నారు. మేనా సప్లయి చేయలేకపోతే —అన్నా! తన విషయం ఏమనుకొంటాడో ఆ అధికారి! మునసబుకు చిన్నతనం అనిపించింది. భయంవేసింది.

"కాళ్ళ మంచం తెప్పించి, దానికి తాళ్ళు కట్టి బొంగు దూర్చి పైన గుడ్డ కప్పి—మోసుకొనిపోతే పనికిరాదా!" అన్నాడు కోమటిశెట్టి.

'ఛీ!' అన్నారు జవానులు.

ఎట్లాగబ్బా!

"మేనా లేదుగాని చాకలివాండ్ల ఇళ్ళల్లో పెళ్ళి పాలకీ ఒకటి ఉన్న" దన్నారు ఒకరు.

"దాన్నయినా తెప్పించవయ్యా" అన్నాడు గుమాస్తా.

"బండిలో ప్రయాణం చేయడాని కెంతమాత్రమూ వీలులేదు. పదిమైళ్ళ ప్రయాణం. ఎందుకయినా పనికివస్తాడా అయ్య! పాలకీ తెప్పించవలసిందే"నన్నారు జవాన్లు.

"ఇంతకంటే ప్రస్తుతంలో ఇంకోమార్గం లే" దన్నారు పదిమందీని.

"ఆలస్యం చేయకయ్యా"అన్నాడు వంటవాడు.

చాకలివెంకడి వసారాలో చూరుకు వ్రేలాడ గట్టిన పాలకీ దింపారు చాకలివాండ్లు.

బూజూ దుమ్మూ దులిపి, గ్రామచావడిదగ్గరకు తీసుకొనివచ్చారు. పాలకీపైన చాందినీ కట్టారు. లోపలకు చలిగాలి దూరకుండా నాలుగువైపులా దట్టమైన దుప్పట్లు బిగించారు, జానెడుమందం బూరుగుదూది పరుపు లోపల పరిచారు. తలకింద మూడుదిండ్లూ, కాలికింద రెండుదిండ్లూ, ఆ ప్రక్క నొక బాలీసూ, ఈ ప్రక్క నొక బాలీసూను!

తహశీల్దారుగారికి వొళ్లు సలసలా కాగి పోతోంది. పన్నెండుగంట లయింది. ఎండ తీక్షణంగా కాస్తోంది. అయ్యగారికి చలి జాస్తి అవుతోంది. జవాన్లూ, గుమాస్తా, వంటవాడూ పట్టుకొని, అయ్యగారిని పాలకీలో పండబెట్టారు. రెండుశాలువలు పైన కప్పారు. తలకు రెండు ఊలు మఫ్లర్లు చుట్టబెట్టారు. ఇక పట్టండంటే పట్టం డన్నారు.

కాని, ఎవరికి పట్టినా ఒకటే తొందర. ఒకటే గలభా! పాలకీ మోయడానికి ఇటు ఇద్దరూ అటు ఇద్దరూ ఆఖరుకి నలుగురయినా ఉండాలా! ఏరీ? వాహకుల సంగతి ఎవరూ అనుకోనేలేదు.

ముగ్గురే ఉన్నారు చాకళ్లు. ఆ వూళ్లో మొదటినుండీ చాకలివాడికి కరువే! శుభాలకూ, అశుభాలకూ కావలసి ఉంటే ప్రక్కవూరునుండి పిలుచుకొని జరుపుకొంటున్నారు గ్రామస్థులు.

"నాలుగోవాడు చాకలి కొండ డున్నాడు. కాని వాడు కూడా జ్వరం తగిలి ఇంటికాడ పండుకున్నా"డని అక్కడ చేరిన ముగ్గురు చాకళ్ళలోనే ఒక డన్నాడు.

"ఇకనేం. పిలిపించండి వాణ్ణి" అన్నారు పదిమందీను. కొండడికోసరం కబురుచేశారు. వాడు కదల లేనన్నాడని వెళ్ళిన మనిషి చక్కా వచ్చాడు.

నడివీధిలో ఉండిపోయింది పాలకీ. ముగ్గురితో కదిలే ఎత్తు కనిపించదు. మునసబుకు తత్తర పుట్టింది.

"ఏదో పాగి చూచి, వాహనం కదిలే మార్గం చూడవయ్యో మునసబూ" అని పదిమందీ పదిమాటలూ అనే వాళ్లేకాని మార్గం చూపే వాళ్ళెవరూ కనిపించరు.

"నాలుగురూపాయలు కూలియిస్తా"నని కూలి మనుష్యుల్ని బ్రతిమలాడుకొన్నాడు మునసబు.

"మేం చాకలివాళ్ళం కాదయ్యోయ్" అని ఎగతాళిచేస్తూ చక్కాబోయారు కూలీలు.

"కొండడి కసలు జ్వరం తగిలిన మాట నిజమవునో కాదో—వాణ్ణి పిలిపించి చూడం" డన్నారు ఒకరు.

"ఇవ్వాళ వీణ్ణిట్లా విడిపిస్తే—రేపు ఇంకొకడు కాలునొప్పి అని ఎగనామం పెట్టుతాడు—ఎల్లుండి ఇంకొకడు—ఆ మర్నాడు కుమ్మరివాడు. ఆ తర్వాత మంగలి!—విడిపిస్తే ఎట్లా?" అన్నాడు వంటమనిషి.

"వంతు చాకలివాడు రావలసిందే" అన్నారు అందరూను.

"ఎత్తండి. ఇంకా ఆలస్యం దేని"కని పాలకీలోనుండి మూలుగుతున్నారు తహశీల్దారుగారు.

"కొండడిని జుట్టుపట్టుకొని లాక్కురం" డన్నారు మునసబు కరణాలు.

కఱ్ఱలు పుచ్చుకొని డవాలీ జవాన్లు చాకలి పాలెం వెళ్లారు. కళ్లు జ్యోతులై కొండడు మంచంమీద పండుకొని డొక్కుంటున్నాడు.

"జ్వరమూ లేదు, నీ బొందాలేదు. తెగ తాగితే వొళ్లు పులకరించిం" దన్నారు జవాన్లు.

చెయ్యిపట్టుకొని బయటికి లాగారు కొండడిని. మెడబట్టి గ్రామ రచ్చకు నెట్టుకొని వచ్చారు.

"ఏందిరా నీ కింత సొయ్యం" అన్నాడు మునసబు. ఒళ్ళు తిరిగి ఎండలోనే కూలబడ్డాడు కొండడు.

"కొమ్ము పట్టరా" అని ముదలకించారు జవాన్లు.

"నావల్ల కాదం" దని దణ్ణం పెట్టాడు కొండడు.

"అసలు వాడికి జ్వరం తగిలిన మాట నిజమేనా" అన్నాడు గుమాస్తా.

"ఇది అంతా వంతు ఎగనామం పెట్టడానికి ఎత్తిన ఎ"త్తన్నాడు ఇంకో పెద్దమనిషి.

"ఇంత సారాయి పోయిస్తాం. కొమ్ముపట్టరా" అన్నాడు మునసబు.

"బంగారం పోయించినా నా వల్లకా" దన్నాడు కొండడు.

"ఎంత సేపయ్యా ఈ బేరం" అని లోపలనుండి పెద్దంగా మూలిగారు తహశిల్ దారుగారు.

గడబద్దం వచ్చిపడింది మునసబుకు. వాహనం కదిలే ఎత్తు కనిపించలేదతగాడికి. చెమ్మటలు పోసి నోరెండి పోతోంది.

"ఈ చాకలివాణ్ణి పట్టుకొని తన్నితే రోగం మెత్తగా కుదురుతుం" దన్నాడు జవాను.

"జ్వరం తగిలి వాడల్లాడుతుంటే దేనికయ్యా తన్నడం" అన్నాడు ఒక చాకలి.

"నాలుగో మనిషిని ఆ తలియారీని పంపరాదండీ దొరా" అని రెండో చాకలి ఉపాయం చెప్పాడు.

"తలియారీ డ్యూటీ గ్రామంలో గస్తుతిరగడం, దొంగల్ని పట్టడమూ" నన్నాడు మునసబు.

"పోనీ, ముగ్గురు వెట్టివాండ్లున్నారే---ఒక భుజం కాచుకోకూడదూ" అన్నాడు మూడోచాకలి.

మునసబు వెట్టివాళ్ళ వంక చూచాడు—ఆపద తప్పించమని

"మేం సర్కారు ముడుపులు మోసేవాళ్ళం కాని అధికార్లని మోసే వాళ్ళం కా"దన్నారు వెట్టివాండ్లు.

పాలకీలో మూలుగు ముమురుతోంది పంతులుకు.

అక్కడ చేరిన పదిమంది తలకాయలూ ఎక్కడి వాండ్లక్కడ జారు కున్నారు.

దుప్పటీ కప్పుకొని కొండ డింటికి పోయాడు. మంచినీళ్ళు తాగివస్తా మని ముగ్గురు చాకలివాళ్లూ మొఖం తప్పించారు. వాహనం నట్టనడివీదిలో అట్లనే ఉండిపోయింది. చెట్టునీడకయినా పట్టుదామంటే చాకలివాళ్ళు కనిపించలేదు. జవాన్లూ, వంటమనిషీ సాయంపట్టి వాహనాన్ని వేపచెట్టునీడకి ఈడ్చారు.

"ఎత్తిన వాహనం అప్పుడే దించా రెందువల్ల?" అని కేక పెట్టాడు తహశీల్‌దారు.

గుమాస్తావైపు తిరిగి దండంపెట్టాడు మునసబు.

"వాహకులు దొరకలేదండి" అని దగ్గరగా వెళ్ళి ముసుగు తొలిగించి తహశీల్‌దారుగారితో చెప్పాడు గుమస్తా.

ఇక లాభం లేదనుకొని జట్కాబండి వెనక్కు తిప్పుకొని ఇంటికి వెళ్ళి, మేనా సప్లయి చేయలేని మనిషి మునసబు నౌకరీకి అర్హుడు కాడని ఆ మునసబుని నౌకరీనుండి బర్తరఫు చేశాడు తహశీల్‌దారు.